శిథిలావస్థలో బస్‌షెల్టర్లు

- ఉమ్మడి దోమకొండ మండలంలో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- రోడ్లపై నిలబడుతున్న వైనం



దోమకొండ మండలం సీతారాంపల్లిలో శిథిలావస్థలో ఉన్న బస్‌షెల్టర్

దోమకొండ: ఉమ్మడి దోమకొండ మండలంలోని సీతారాంపల్లితో పాటు బీబీపేట మండలంలోని పలు గ్రామాల్లో బస్‌షెల్టర్లు శిథిలావస్థలో ఉన్నాయి. ప్రయాణికులు వాన, ఎండలో రోడ్లపై నిల్చునే పరిస్థితి నెలకొంది. రోడ్లకు సమీపంలో చాలా గ్రామాల్లో ప్రయాణికులు చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. చాలా గ్రామాలకు ఊరి నుంచి బస్సు స్టేజీలు దూరంలో ఉన్నాయి. అక్కడ ఎలాంటి నిర్మాణాలు లేక వాహనాల రాక కోసం తలదాచుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్‌షెల్టర్లు నిర్మించినా చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయి.

అవస్థలు పడుతున్న వృద్ధులు..

గ్రామీణ ప్రాంతాల్లో చాలా చోట్ల అనువుగాని ప్రదేశాల్లో బస్‌షెల్టర్లు నిర్మించారు. దీంతో అవి వినియోగం లేకుండా వృథాగా ఉంటున్నాయి. బస్‌షెల్టర్లు నిరుపయోగంగా ఉన్నచోట వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వానకాలంలో వర్షం కురిస్తే పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది. ఈ విషయంలో ఆర్టీసీ అధికారులు స్పందించి బస్‌షెల్టర్‌లను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపై నిలబడుతున్నాం



మా గ్రామంలోని బస్‌షెల్టర్ పూర్తిగా శిథిలావస్థలో ఉంది. గ్రామ శివారులోని బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరడంతో బస్సుల కోసం రోడ్లపై నిలబడే పరిస్థితి ఉంది. ఎండలో రోడ్లపై చెట్లకింద నిలబడుతున్నాం. వర్షాకాలం చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఈ విషయంలో ఆర్టీసీ అధికారులు స్పందించి గ్రామంలో నూతన బస్‌షెల్టర్ నిర్మించాలి.

– జాలిగాం నాంపల్లి, సీతారాంపల్లి

ఆయా జీపీలదే బాధ్యత

గ్రామ పంచాయతీల పరిధిలోని బస్‌షెల్టర్లను చూసుకునే బాధ్యత ఆయా గ్రామ పంచాయతీలదే. వారే వాటిని పరిరక్షించుకోవాలి. బస్‌షెల్టర్ మరమ్మతులు, ఇతర సదుపాయాలు వంటివి కల్పించే పంచాయతీలదే బాధ్యత. ఈ విషయంలో పంచాయతీ వారు స్పందించి పనులు చేయించాలి.

– కరుణశ్రీ, ఆర్టీసీ డిపో మేనేజర్, కామారెడ్డి

క్లుప్తంగా

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న ప్రయివేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఎంఈవో ఎల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. పలు పాఠశాలలకు అనుమతులు లేవని స్వయంగా డీఈవోనే ప్రకటన చేసినా యథేచ్ఛగా అడ్మిషన్లు కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్లు శివ ప్రసాద్, ప్రవీణ్, నాయకులు నరేష్, నితిన్‌లు ఉన్నారు.

బాన్సువాడలో..



బాన్సువాడ : బాన్సువాడలో గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఏబీపీఎస్‌యూ, ఎల్ఎస్‌వో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయంలో ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ పట్టణంలో గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాంటి పాఠశాలల యజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. గుర్తింపు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బోడ అనిల్, జీవన్, కుషాల్, గోపాల్‌సింగ్, సునీల్, శివ, విజయ్, నందునాయక్ ఉన్నారు.

విండో అభివృద్ధికి వినతిపత్రం అందజేత



భిక్కనూరు: రైతులకు సింగిల్‌విండోలు మరింత మెరుగైన సేవలను అందించాలని జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ రమేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం భిక్కనూరు సింగిల్‌విండో చైర్మన్ గంగ్ల భూమయ్య, నిజామాబాద్‌లో డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ రమేశ్ రెడ్డిని కలిసి విండో అభివృద్ధి కోసం వినతిపత్రం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా రమేశ్ రెడ్డి మాట్లాడుతూ విండోలు కేవలం పురుగుమందులు, విత్తనాలను, ఎరువులను విక్రయించడంతో పాటు ఇతర వ్యాపారాలను కూడా చేయాలలన్నారు. కార్యక్రమంలో విండో వైస్ చైర్మన్ ముచ్చర్ల రాజిరెడ్డి,డైరెక్టర్ బచ్చగారి నర్సింలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుధర్శన్‌లు ఉన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు రాజ్యాధికారంలోకి రావాలి



కామారెడ్డి టౌన్: బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు రాజ్యాధికారంలోకి రావాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ బోలేశ్వర్ అన్నారు. ఆ పార్టీ వ్యవస్థాకుడు, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహరాజ్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని అమర వీరుల స్థూపానికి తెలంగాణ బీసీ, ఎస్సీ,ఎస్టీ అమరవీరుల స్థూపం అని రాశారు. ఈ మేరకు బోలేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు 1200 మంది ప్రాణ త్యాగం చేస్తే భోగాలు మాత్రం అగ్రకులాలు అనుభవిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు లక్ష్మణ్, నాయకులు రాజు, రాజశేఖర్, శివరామకృష్ణ, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం మూసివేతతో ఇబ్బందులు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం గత రెండు రోజులుగా మూసి వేయడంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వర్ లోపం కారణంగా సెంటర్ మూసి వేస్తున్నామని నిర్వహకుడు ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. పట్టణంలోని మిగతా కేంద్రాలలో సైతం సర్వర్ సమస్యతో ఇబ్బందులు ఎదురయ్యాయి. అధికారులు స్పందించి సమస్య తీర్చాలని వినియోగదారులు కోరారు.

నేటి చిత్రం

కొత్త స్తంభం అమర్చారు.. పాత వాటిని మరిచారు



బాన్సువాడ రూరల్: మండలంలోని పులిగుండు తండాలో పాత విద్యుత్ స్తంభాలు పూర్తి శిథిలావస్థకు చేరడంతో వాటి పక్కనే కొత్త విద్యుత్ స్తంభాలను అమర్చారు. శిథిలావస్థకు చేరిన పాత విద్యుత్ స్తంభాలను తొలగించడం మరిచారు. దీంతో వానాకాలంలో వీచే ఈదురు గాలులకు స్తంభాలు ఇళ్లపై కూలి పోయే ప్రమాదం ఉందని తండా వాసులు భయభ్రాంతులకు గురువుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

– మోతీరాం నాయక్, పులిగుండు తండా

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

బీజేపీ మండల కమిటీల ఎన్నిక


ఎన్నికైన బీజేపీ మండల కమిటీ సభ్యులు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట బీజేపీ మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఇదివరకే మండల బీజేపీ అధ్యక్షుడుగా బొల్లారం క్రాంతి కుమార్‌ను జిల్లా నాయకులు ఎన్నుకున్నారు. మిగిలిన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు రాజులు ఆదేశాల మేరకు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గొల్ల సాయిలు(బాణాపూర్), పెద్ది సంగీత(లింగంపేట), సురేష్‌గౌడ్(మోతె), దూరిశెట్టి రవి(బాణాపూర్), ప్రధాన కార్యదర్శులుగా ఆకుల విష్ణువర్దన్(శెట్పల్లి సంగారెడ్డి), మార్గం శుభాష్(రాంపూర్), కార్యదర్శులను, అలాగే మండలంలోని ప్రతి గ్రామం నుంచి 34 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు క్రాంతికుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దత్తురాం, మురళి, శివ్వయ్య, పోశెట్టి, ఎల్లేశం, నవీన్‌కుమార్, గణేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి...

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండల బీజేపీ కార్యవర్గాన్ని జిల్లా బీజేపీ అధ్యక్షులు నీలం చిన్న రాజులు బుధవారం ప్రకటించినట్లు మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు తెలిపారు. ఉపాధ్యక్షులుగా సాయిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాములు, నర్సింహారెడ్డి,కార్యదర్శులుగా మహేందర్, అశోక్, సహాయ కార్యదర్శులుగా మాలి, మానస, సరిచంద్, సాయిరాం, కోశాధికారిగా సుభాష్‌ను మండల కార్యవర్గంలో చోటు కల్పించినట్లు ఆయన తెలిపారు.

చాముండేశ్వరి ఆలయ కమిటీకి నియామక పత్రం అందజేత



దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి దేవాలయ కమిటీని ఇటీవల ఏర్పాటు చేశారు. బుధవారం ఆలయ కమిటీ కార్యవర్గానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ హైదరాబాద్ లోని తన స్వగృహంలో నియామక పత్రాన్ని అందించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సిద్దారెడ్డి, డైరెక్టర్‌లుగా నార్ల వెంకటేశం, ఏల్లం, రమేష్, బాల్‌రాజ్‌లను నియమించారు. ఈ సందర్భంగా వారు షబ్బీర్‌అలీని శాలువాతో సన్మానించారు.ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆస్మ అఫ్షిన్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో అధికారులు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలు జ్వరాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య బోధన



రామారెడ్డి/ నాగిరెడ్డిపేట : ప్రభుత్వ కళాశాలలోని నాణ్యమైన విద్య బోధన అందిస్తున్నామని రామారెడ్డి కళాశాల లెక్చరర్లు అన్నారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలలో బుధవారం పదో తరగతి పాసైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందిస్తుందన్నారు. విద్యార్థులు రామారెడ్డి ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరారు. కళాశాలలో ఉన్న సదుపాయాలను, ఫ్యాకల్టీని, విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లెక్చరర్లు అశోక్ గౌడ్, ప్రసాద్, వెంకట్ రాజు, రాజు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అధ్యాపకులు రాజశేఖర్‌రెడ్డి మండలంలోని వదల్‌పర్తిలో ప్రచారం నిర్వహించారు. పదోతరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులను కలిసి ఇంటర్‌విద్య కోసం తమ కళాశాలలో చేరాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో నిర్మించుకోవాలి


గాంధారిలో ఇంటి మార్కింగ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చందర్ నాయక్


చిన్నరాంపూర్‌లో ఇంటి పనులు ప్రారంభిస్తున్న డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి

గాంధారి(ఎల్లారెడ్డి): లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో త్వరగా నిర్మించుకోవాలని అదనపు కలెక్టర్ చందర్ నాయక్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. ఎంపీడీవో రాజేశ్వర్ తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి

బాన్సువాడ రూరల్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రొసీడింగ్స్ అందుకున్న లబ్ధిదారులంతా వెంటనే పనులు ప్రారంభించాలని బాన్సువాడ డీఎల్‌పీవో సత్యానారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని చిన్న రాంపూర్ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఖాళీ స్థలాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి ముగ్గుపోసి భూమి పూజ చేశారు. జీపీ కార్యదర్శి సురేష్, నాయకులు షేక్ అజీమ్, అజీజ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్

ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట/పిట్లం : ఎల్లారెడ్డి మండలం కొక్కొండ గ్రామంలో జీపీ సిబ్బంది ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ వేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. లింగంపేట మండలకేంద్రంలో పలువురికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎంపీడీవో నరేశ్ అందజేశారు. అనంతరం ఇళ్లకు మార్కౌట్ ఇచ్చారు. పిట్లం మండలం బుర్నాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండల పరిషత్ అధికారి కమలాకర్ భూమి పూజ చేశారు. గ్రామానికి 13 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


మంగ్లూర్‌లో రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ విక్టర్


వజ్జపల్లికుర్దులో.. కామారెడ్డి ఆర్‌డీవో వీణ

- అడిషనల్ కలెక్టర్ విక్టర్
- మంగ్లూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సు పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): భూముల సమస్యల పరిష్కారం కోసం గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు అడిషనల్ కలెక్టర్ విక్టర్ అన్నారు. రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. బుధవారం మండలంలోని మంగ్లూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సును ఆయన తనిఖీ చేసి ఫిర్యాదులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, గిర్దావర్ సాయిలు, పంచాయతీ కార్యదర్శి రమ్యశ్రీ, కాంగ్రెస్ నాయకులు దత్తు, సాయిలు, ఆగమయ్య తదితరులున్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న కామారెడ్డి ఆర్‌డీవో వీణ సూచించారు. మండలంలోని వజ్జపల్లి కుర్దులో జరిగిన రెవెన్యూ సదస్సును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫిర్యాదులను పరిశీలించారు. తహసీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ తిరుపతి, ఆర్ఐ సాహిత్య, రెవెన్యూ సిబ్బంది ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో భారీగా దరఖాస్తులు

ఎల్లారెడ్డి/బీబీపేట/భిక్కనూరు/రాజంపేట/పిట్లం/మద్నూర్ : ఎల్లారెడ్డి మండలం దావల్‌మల్కపల్లి, సబ్దల్‌పూర్ గ్రామాలలో రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రైతుల నుంచి ఆర్జీలను స్వీకరించినట్లు తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. బీబీపేట మండలం మల్కాపూర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ గంగాసాగర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. భిక్కనూరు మండలం అంతంపల్లిలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. తహసీల్దార్ సునీత, ఆర్ఐ బాలయ్యలు రైతుల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. రాజంపేట మండలం పొందుర్తిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 123, గుండారంలో 559 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ జానకి తెలిపారు.పిట్లంమండలం బుర్నాపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 11, కిష్టాపూర్ గ్రామంలో 15 ఫిర్యాదులు వచ్చినట్లు ఉప తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. మద్నూర్ మండలం వాడిఫతేపూర్, పెద్ద శక్కర్గాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 35 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ ముజీబ్ తెలిపారు.ఈకార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో జిల్లా డాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన సమ్మర్ డాన్స్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. విద్యార్థులు నేర్చుకున్న నృత్యాలను ప్రదర్శించారు. ఈనృత్యాలు వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా డాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కార్తిక్, శైలజ, మోహన్, వెంకటేష్, స్వామి తదితరులున్నారు.

ఆయుష్ ఆరోగ్య మందిరంలో యోగాసన పోటీలు



కామారెడ్డి అర్బన్: జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో మహిళలు, పురుషులకు యోగాసన పోటీలు నిర్వహించినట్లు ఆయుష్ డీపీఎం ఆకుల శ్రీకాంత్ తెలిపారు.కామారెడ్డి ఎన్‌జీవోస్ కాలనీలోని ఆయుష్ ఆరోగ్య మందిరంలో బుధవారం ఉదయం నిర్వహించిన పోటీల్లో డీపీఎం శ్రీకాంత్‌తో పాటు ప్రకృతి వైద్యులు దేవయ్య, యోగాచార్యులు బాల్‌లింగం, సాయినీల తదితరులు పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు బహుమతులు ప్రదానం చేస్తారని డీపీఎం పేర్కొన్నారు.

ఆరోగ్యానికి యోగా మేలు



పిట్లం(జుక్కల్): శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో మేలు చేస్తుందని ఆర్య సమాజ్ అధ్యక్షుడు పడిగెల విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆయన బుధవారం ఆర్య సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత యోగా తరగతులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆర్య సమాజ్‌లో ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఉచిత యోగా తరగతులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు, ఆర్య సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను సాగుచేసుకోవాలి


బీబీపేటలో అవగాహన కల్పిస్తున్న సంపత్ కుమార్

దోమకొండ/బీబీపేట : రైతులు నాణ్యమైన విత్తనాన్ని సాగుచేస్తే పంట దిగుబడి బాగా వస్తుందని బాబూ జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు అన్నారు. ఈసందర్భంగా దోమకొండ, బీబీపేట రైతు వేదికల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో బుధవారం వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సంపత్ కుమార్ మాట్లాడారు. నాణ్యమైన విత్తనాన్ని సాగుచేస్తే పంట దిగుబడి 10 నుంచి 15 శాతం పెరుగుతుందని తెలిపారు. అనంతరం వరిలో జగిత్యాల వరి 1, జగిత్యాల వరి 3, మొక్కజొన్నలో డీహెచ్ ఎం 117, తదితర రకాలను రైతులకు పంపిణీ చేశారు. పంట రకాల పైన, పంటల చీడ పీడల పైన రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయాధికారులు మణిదీపిక, జి. నరేంద్ర, విస్తీర్ణాధికారులు కృష్టారెడ్డి, మనుష్య, రాఘువేంద్ర, సంతోష్, రాజేష్ రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సోలార్ లైట్ విరాళం

తాడ్వాయి (ఎల్లారెడ్డి) : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో గల శ్మశాన వాటికకు అదే గ్రామానికి చెందిన ఆకిటి గంగారెడ్డి సోలార్ లైట్‌ను విరాళంగా అందజేశారు. గ్రామపెద్దలు, యువకులు గంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటింటి కుటుంబ సర్వే పారితోషికం చెల్లించాలి

కామారెడ్డి అర్బన్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వెంటనే తగిన పారితోషికం చెల్లించాలని పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంబీర్ మనోహర్‌రావు, జే.లక్ష్మీరాజంలు అన్నారు. ఈమేరకు వారు బుధవారం కలెక్టర్ సంగ్వాన్ కు వినతి పత్రం అందజేశారు.

రైతు గుర్తింపు కార్డు కోసం వివరాల సేకరణ

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని గండిమాసానిపేట గ్రామంలో వ్యవసాయ అధికారులు బుధవారం రైతు గుర్తింపు కార్డునకు సంబంధిందచిన వివరాలను సేకరించారు. రైతులకు గుర్తింపు కార్డు అందించడంలో భాగంగా రైతులకు సంబంధించిన పట్టాపాసు పుస్తకంలోని భూమి వివరాలు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ వివరాలను సేకరించినట్లు ఏఈవో సతీశ్ తెలిపారు. కార్యక్రమంలో రైతులు తదితరులున్నారు.

ఆయిల్‌పామ్ తోటల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



భిక్కనూరు: ఆయిల్‌పామ్ తోటల పెంపకంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని హిందుస్తాన్ యూనిలీవర్ కంపెని మేనేజర్ అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల సమవేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒక ఎకరాకు 50 మొక్కలను నాటాలని సబ్సిడీ పోను ఒక్క మొక్కకు రైతు రూ. 20 చెల్లించాల్సి ఉంటుందన్నారు. నాలుగు సంవత్సరాల వరకు ఎకరాకు అంతర పంటల కోసం ప్రభుత్వం రూ. 2100, మెయింటనెన్స్ కోసం ఎకరాకు మరో రూ. 2100లను రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. నాలుగు ఏళ్ల పాటు అంతరపంటలుగా సోయ, కూరగాయలు, పత్తి అరటి పుసుపు పంటలను సాగుచేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ జిల్లా అధికారిణి సంతోషిని ఏఈవో ప్రియాంక, కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ సత్య నారాయణలు పాల్గొన్నారు.

జుక్కల్ ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని పూజలు

మద్నూర్(జుక్కల్): జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత వారం రోజుల క్రితం ఎమ్మెల్యేకు ఫుడ్‌పాయిజన్ జరిగి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హన్మండ్లు స్వామి తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్ ఆలయ కమిటీ చైర్మెన్ రాంపటేల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ పరమేశ్ పటేల్, నాయకులు రమేశ్, అశోక్, సాయిబాబా, శ్రీనివాస్, నాగ్‌నాథ్, పండరి ఉన్నారు.